క్లుప్తంగా

ఇన్‌చార్జి పీఆర్ ఏఈగా మనోహర్



వరికుంటపాడు: మండల పంచాయతీరాజ్ శాఖ ఇన్‌చార్జి ఏఈగా మనోహర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వింజమూరులో సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ని వరికుంటపాడు ఇన్‌చార్జి ఏఈగా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీఓ నాగూర్‌వలీకి జాయినింగ్ రిపోర్టును అందజేసి బాధ్యతలను స్వీకరించారు.

కోన కాలువ శుభ్రం



ఉదయగిరి: పట్టణ సమీపంలోని దుర్గంపై ఉన్న కోనకాలువను పారిశుధ్య సిబ్బంది బుధవారం శుభ్రం చేశారు. పట్టణ ప్రజలకు తాగు నీటిని అందించే కోన కాలువలో పడమటి గాలులకు చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తాయి. దీంతో పంచాయతీ పాలకవర్గం స్పందించి పారిశుధ్య సిబ్బందితో కాలువలో పేరుకున్న చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్, డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా పర్యవేక్షించారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



దుత్తలూరు: రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యనమల నాగరాజు కోరారు. మండలంలోని వెంకటంపేటలో చేపడుతున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రీ సర్వే బృందానికి రైతులు సహకరించి తమ వద్ద ఉన్న ఆధారాలను చూపి ఎలాంటి సమస్యలు లేకుండా సర్వే చేయించుకోవాలని సూచించారు. అనంతరం రీసర్వే సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకట్, సర్వేయరు శివ, సర్వే బృందం పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

ఉదయగిరి: ఉదయగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుత్తలూరు మండలం నందిపాడు, మర్రిపాడు మండలం కేతిగుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై నెల్లూరు ప్రత్యేక స్క్వాడ్ అధికారులు, ఉదయగిరి ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 21 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఉదయగిరి ఎక్సైజ్ ఎస్సై దీప్తికరంత్ తెలిపారు.

నూతన ఆస్పత్రి ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలో వైద్యులు పీఎస్‌బీ శ్రీనివాస్, అమర్‌జ్యోతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన ఆర్థో ఆస్పత్రిని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం ప్రారంభించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

మంత్రికి ఆహ్వానం



ఆత్మకూరు: ఆత్మకూరుకు వచ్చిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని హనుమాన్ శోభాయాత్ర కమిటీ సభ్యులు బుధవారం కలిశారు. పట్టణంలో ఈ నెల 23న అంగరంగ వైభవంగా నిర్వహించే హనుమాన్ శోభాయాత్రలో పాల్గొనాలని ఆహ్వానించారు. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కేశవచౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, తుమ్మల చంద్రారెడ్డి, జి మునిరెడ్డి పాల్గొన్నారు.

నీతి కథలపై అవగాహన

మర్రిపాడు: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో 17వ రోజు బుధవారం విద్యార్థులకు ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి దివానపు నారాయణరావు నీతికథల్లోని సారాంశం, చదవడం, రాయడంపై అవగాహన కల్పించారు. అనంతరం చెస్, క్యారమ్స్, తదితర ఇండోర్ గేమ్స్ ఆడించి వ్యాయామాలు చేయించారు.



కల్యాణోత్సవానికి హాజరైన అశేష భక్తజనం

నేత్రపర్వంగా

లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరిహర క్షేత్రంలో జరుగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని బుధవారం ఉదయం నేత్రపర్వంగా నిర్వహించారు. టీడీడీ వేదపండితులు తనుజా విష్ణువర్ధన్ అధ్వర్యంలో వేద పండితులు శ్రీదేవి, భూదేవి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. నూతన దంపతులకు బ్రహ్మోత్సవాల నిర్వాహకులు, ఆలయ మాజీ చైర్మన్ లెక్కల చినకొండారెడ్డి, లక్ష్మీకాంతమ్మ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఐ వెంకటనారాయణ,ఎస్సైవీరప్రతాప్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు అలకలతోపు

బ్రహ్మోత్సవాల్లో విశేషమైన అలకలతోపు చోరసంవాదం, లక్ష్మీసంవాదం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారు.



లక్ష్మీనరసింహస్వామి కల్యాణ తంతు నిర్వహిస్తున్న వేదపండితులు



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఆలయ మాజీ చైర్మన్ ఎల్‌సీకొండారెడ్డి

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు

ప్రచారం కరువు

- ఎంఈఓ కార్యాలయాల్లో ఏర్పాటుకాని హెల్ప్‌డెస్క్‌లు
- గ్రామ సచివాలయాల్లో కనిపించని ఫ్లెక్సీలు, పోస్టర్లు
- పేదలకు అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం
- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

దుత్తలూరు: ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై పేదలకు అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో ఐదేళ్లు నిండిన విద్యార్థులకు 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలను కల్పించాలి. కానీ విద్యాశాఖ నిర్లక్ష్యం..ప్రైవేట్ యాజమాన్యాల నిరాసక్తతతో క్షేత్రస్థాయిలో ఉచిత ప్రవేశాల కల్పన జరగడం లేదు. ఉచిత ప్రవేశాలపై పేదలకు కనీస అవగాహన కల్పించని కారణంగా వారు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, పేద కుటుంబాలకు చెందిన బాలలు అర్హులు. దివ్యాంగ, అనాథ, హెచ్‌ఐవీ బాధిత బాలలకు ఐదు శాతం, షెడ్యూల్డ్ తెగలకు నాలుగు శాతం, షెడ్యూల్డ్ కులాలకు పది శాతం, బీసీ, మైనారీ, ఓసీల్లోని పేదలకు ఆరు శాతం సీట్లు కేటాయిస్తారు. పేదలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,20 లక్షలలోపు , పట్టణ ప్రాంతాల్లో రూ.1.40 లక్షలలోపు ఉండాలి. ఉచిత ప్రవేశాలకు గత నెల 28వ తేదీ ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. ఆన్‌లైన్, మీసేవా, సచివాలయం, విద్యాశాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 16 నుంచి 20వ తేదీ వరకు విద్యార్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. మే 21 నుంచి 24వ తేదీ వరకు లాటరీ విధానంలో మొదటి దశలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను జూన్ 2వ తేదీన నిర్ధారిస్తారు. 2వ దశ ఎంపిక జాబితాను జూన్ 6వ తేదీ విడుదల చేస్తారు. విద్యార్థుల ప్రవేశాలను జూన్ 12న నిర్ధారిస్తారు.



దుత్తలూరు ఎంఈఓ కార్యాలయం

ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల సంఖ్య

ఉదయగిరి	5
కొండాపురం	2
కలిగిరి	7
సీతారామపురం	3
జలదంకి	2
వింజమూరు	5
వరికుంటపాడు	0



అవగాహన కల్పించడంలో అలసత్వం

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయింపుపై గ్రామ, మండలస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. పత్రికల్లో ప్రకటనలతో పాటు మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు, గ్రామ సచివాలయాల వద్ద బ్రోచర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. అయితే కొన్ని మండలాల్లో కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితమై క్షేత్రస్థాయిలో ప్రచారం కల్పించలేదు. మరికొన్ని మండలాల్లో పత్రికా ప్రకటనలు కూడా లేవు. ప్రధానంగా ఈ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యేవరకు నిరంతరంగా అవగాహన కల్పించాల్సి ఉంది. అదేవిధంగా మండలస్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేయాలి. సోషల్ మీడియాలో సైతం ప్రచారం నిర్వహించి అధిక శాతం మంది సద్వినియోగం చేసుకునేలా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా..అమలుకు నోచుకోవడం లేదు. విద్యాశాఖ అలసత్వంతో పేదలకు అవగాహన లేక దరఖాస్తు చేసుకోవడం లేదు.

అవగాహన కల్పిస్తాం



ఈ నెల 15వ తేదీతో ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగియనుంది. ఉచిత ప్రవేశాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులకు సూచించాం. మారుమూల ప్రాంతాల్లో కూడా అవగాహన కల్పించేందుకు కృషిచేస్తాం.

–వెంగయ్య, ఎంఈఓ, దుత్తలూరు



ప్రభుత్వం రూపొందించిన పోస్టర్

వాసవీమాత కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

కావలి(జలదంకి): కావలిలోని ఒంగోలు బస్టాండ్ సమీపంలోని పునర్నిర్మించిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం 8.30 గంటలకు గురుప్రార్థన, యాగశాల ప్రవేశం, గణపతిపూజ, అగ్నిప్రతిష్ఠ , మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఇంటర్ విద్యార్థులకు నగదు బహుమతులు



నగదు చెక్కు అందుకున్న భవ్యశ్రీ

వింజమూరు(ఉదయగిరి): కాలేజ్ మెంటార్ సంస్థ ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షలో వింజమూరుకు చెందిన విద్యార్థిని పోటు భవ్యశ్రీ ఉత్తమ ప్రతిభకనబర్చింది. బుధవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కాలేజ్ మెంటార్ సంస్థ సీఈఓ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రూ.50వేలు నగదు చెక్కును అందుకుంది. అలాగే ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పేద విద్యార్థి పరుచూరి హేమంత్‌కు రూ.10వేలు నగదు అందజేశారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సంగం: మండల ప్రగతి, ప్రజాసమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం అధికారుల గైర్హాజరుతో మొక్కుబడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకావాల్సి ఉన్నా 20 శాతం మంది మాత్రమే వచ్చారు. ప్రధాన శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంతో సమావేశం నామమాత్రంగా సాగింది. తొలుత యుద్ధంలో వీరమరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో పొందుపరిచిన అజెండాలోని అంశాలను ఎంపీడీఓ షాలెట్ చదివి వినిపించారు. అనంతరం సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. మండలాభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరైతే సమస్యలు ఎవరికి తెలియజేయాలని మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో గైర్హాజరైన అధికారులకు నోటీసులు అందజేస్తామని ఎంపీడీఓ తెలిపారు. జెడ్పీటీసీ రావుల లక్ష్మి, వైస్‌ఎంపీపీ తలపల ఇందిర, ఎంపీటీసీ ముడి మల్లికార్జునరెడ్డి, పట్టెం లక్ష్మి, సర్పంచ్ సురేష్ పాల్గొన్నారు.

22న హనుమజ్జయంతి ఉత్సవాలు



ఉదయగిరి రూరల్: పట్టణ పరిధిలోని కోనకాలువ దగ్గర ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 22న విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని శివాలయంలో హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. విశ్వహిందూ పరిషత్, కమిటీ సభ్యులు బాలగురవయ్య, శ్రీనివాసరావు, సుబ్బయ్య, కార్తీక్, శ్రీహరి, దుర్గాప్రసాద్, వెంగయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి

దగదర్తి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులందరూ ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ సీహెచ్ నాగరాజు సూచించారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు నగదును మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవపై అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

కావలి కాలువకు సాగునీటి విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు డీవీ కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్

సంగం: రెండు పంటకు సంబంధించి సంగం హెడ్‌రెగ్యులేటర్ నుంచి కావలి కాలువకు కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ సాగునీటిని బుధవారం విడుదల చేశారు. తొలుత గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐఏబీ సమావేశంలో కావలి కాలువకు 8.7 టీఎంసీల నీటిని కేటాయించారని తెలిపారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని కోరారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ సోమశిల ఉత్తర కాలువకు తోడు హైలెవల్ కెనాల్, వెలిగొండ ప్రాజెక్టులు పూర్తయితే ఉదయగిరి నియోజకవర్గానికి సాగునీరు పుష్కలంగా అందుతుందన్నారు. ఉదయగిరి, కావలి, కందుకూరు నియోజకవర్గాలకు పూర్తిస్థాయిలో నీటిని అందించేందుకు సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. సాగునీటి సంఘం అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

లేఅవుట్ల పరిశీలన



ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు మండలాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్లను నుడా అధికారులు ఎం వినయ్‌కుమార్, హరిశంకర్ బుధవారం పరిశీలించారు. వరికుంటపాడు మండలం విరువూరు పంచాయతీలో సర్వే నంబరు 548లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేశారని బీజేపీ మండలాధ్యక్షుడు ఎనుగు ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేయడంతో నుడా అధికారులు పరిశీలించారు. నుడా నిబంధనల మేరకు లేఅవుట్ లేదని, సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.

21 నుంచి వీరాంజనేయ స్వామి ఉత్సవాలు

దుత్తలూరు: హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని వెంకటంపేటలోని వీరాంజనేయస్వామి ఉత్సవాలను ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 21న గణపతిపూజ, కలశపూజ, సహస్రనామార్చన, 22న హనుమజ్జయంతి సందర్భంగా వీరాంజనేయ స్వామికి అభిషేకం, హోమం, పూర్ణాహుతి, 23న సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాదర్తికి సత్కారం

కావలి(జలదంకి): కావలి రెడ్‌క్రాస్ భవనంలో జ్ఞానీజైల్‌సింగ్ నేషనల్ మెమోరియల్ అవార్డు గ్రహీత పాదర్తి నాగరాజును రెడ్‌క్రాస్ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ డీ రవిప్రకాస్, వైస్‌చైర్మన్ కే హరినారపరెడ్డి, ముఫ్తీ ఖలీల్‌అహ్మద్, మొఘల్ సలీమ్ బేగ్, ఆరికట్ల మధుసూదన్, ఒరుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఉదయగిరి రూరల్: మండలంలోని గడ్డంవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మాలకొండయ్య, పీఎంసీ చైర్మన్ రత్నయ్య ఆధ్వర్యంలో పదో తరగతి ఉత్తీర్ణులైన, పదో తరగతిలో చేరనున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆత్మకూరు ఐటీఐ కళాశాల అధ్యాపకుడు పీ చంద్రశేఖర్ పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులు..ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు కొత్త సొబగులు



రంగులతో ముస్తాబైన ప్రయాణికుల ప్రాంగణం

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ కొత్త సొబగులు సంతరించుకుంది. ప్రయాణికుల ప్రాంగణాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ప్రయాణికుల కోసం కొత్తగా కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా తీర్చిదిద్ది నిర్వహణపై శ్రద్ధపెట్టారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని డిపో మేనేజరు కరిమున్నీసా తెలిపారు.



ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన నూతన కుర్చీలు



కొత్తగా తీర్చిదిద్దిన మరుగుదొడ్లు

ప్రహరీ లేక తరగతులకు డుమ్మా



సోమశిల: అనంతసాగరం మండలం సోమశిలలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు ప్రహరీ లేని కారణంగా గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. గురుకులంలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయి. కేవలం ప్రహరీ లేని కారణంగా గిరిజన విద్యార్థులు తరగతులకు డుమ్మా కొడుతున్నారు. ఉపాధ్యాయులకు తెలియకుండా సమీపంలోని పెన్నా నది, అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయి గడుపుతున్నారు. ఈ కారణంగా గురుకులంలో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఏటా గురుకులంలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గురుకులాన్ని తెరిచిలోగా ప్రహరీని నిర్మించి విద్యార్థులు తరగతులకు డుమ్మా కొట్టకుండా చూడాల్సిన అవసరం ఉంది.